గణితశాస్త్రం పరీక్షలో 3వ ప్రశ్నకు మార్కులు కలపాలి


కందికొండ శ్రీనివాస్

అబిడ్స్: 10వ తరగతి గణితశాస్త్రం పరీక్షలో 3వ ప్రశ్నకు రెండు మార్కులు ప్రభుత్వం కలపాలని తెలంగాణ రాష్ట్ర గణిత ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..గణిత శాస్త్ర ప్రశ్న పత్రంలో 3వ ప్రశ్నలో ఒక దగ్గర ఫ్లాగ్‌పోల్ అని, అదే ప్రశ్నలో మరో దగ్గర టవర్ అని ఇవ్వడం ద్వారా విద్యార్థులు అయోమయానికి గురయ్యారన్నారు. పాఠ్య పుస్తకంలో ఈ ప్రశ్న లేకపోవడంతో విద్యార్థులు సందిగ్ధతకు లోనయ్యారన్నారు. ఏ విద్యార్థి అయినా 3వ ప్రశ్నను అటెంప్ట్ చేస్తే రెండు మార్కులు ఇవ్వాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి విజ్ఞప్తి చేశారు.

‘ప్రజలకు అందుబాటులో ఉండాలి’


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ నాయకులు, మజ్లిస్ ఏరియా కమిటీ నాయకులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన మజ్లిస్ సీనియర్ నాయకులు, మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను తన దృష్టికి తేవడంలో మజ్లిస్ ఏరియా కమిటీ వారు క్రియాశీలకంగా పని చేయాలన్నారు. అంతేకాకుండా వారు ప్రతినిత్యం ఏరియాల్లో పర్యటిస్తూ సమస్యలను తెలుసుకుంటూ ఉండాలని ఆయన అన్నారు. ఆయన వెంట అమీరుద్దీన్, అన్వర్‌ఖాన్, సయ్యద్ అలీ, జుబేర్‌బిన్ ఆవద్ తదితరులున్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

గోల్కొండ: గోల్కొండ కోటలోని జగదాంబిక మహంకాళి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరాజు అన్నారు. శనివారం కోటపై భాగంలో గల ఆలయ ప్రాంగణంలో అమ్మవారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న భక్తులతో పాటు అమ్మవారి హుండీ ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. కరోనా మహమ్మారి అనంతరం జరిగే బోనాలకు రికార్డు స్థాయిలో భక్తులు వస్తున్నారన్నారు. ఈరోజు జరిగిన హుండీ లెక్కింపులో మొత్తం రూ.78,104 ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ వృత్తిపని సంఘం వారి అధ్యక్షుడు బొమ్మల సాయిబాబా చారి, జగ్గయాదవ్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేందర్, ప్రసాద్, నవీన్ తదితరులున్నారు.

ముగిసిన సమాహార నాటకోత్సవం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మూడు రోజులుగా రవీంద్రభారతిలో జరుగుతున్న సమాహార థియేటర్ ఫెస్టివల్ శనివారంతో ముగిసింది. సంస్థ 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కొత్త టాలెంట్‌ను వెలికి తీసేందుకు ఈ ఉత్సవాలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు యువ దర్శక, కళాకారులు వివిధ అంశాలపై ప్రదర్శించిన నాటకాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, నాటకరంగ దర్శకుడు రత్నశేఖర్, థియేటర్ ఫెస్టివల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

‘ప్రతిపక్షాలను మోదీ ప్రభుత్వం వేధిస్తోంది’


గారీ సతీష్

అబిడ్స్: ప్రతిపక్షాలపై దర్యాప్తు సంస్థలచే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం పలు రకాల వేధింపులకు పాల్పడుతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి గారీ సతీష్ పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలపై ఎన్‌డీఏ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా ఈడీ, సీబీఐ, ఇన్‌కమ్ ట్యాక్స్‌ల అధికారులపై దాడులు చేయిస్తూ వేధిస్తున్నారన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..మోదీ ఎన్ని అసత్య ప్రచారాలు, ఎన్ని వేధింపులకు పాల్పడ్డా ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఇండియా కూటమిదే విజయమన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీని మోదీ టార్గెట్ చేస్తూ ఇష్టారాజ్యంగా వేధిస్తున్నారని ఆరోపించారు. ప్రజలంతా మోదీ వేధింపులను గమనించి కాంగ్రెస్‌నే గెలిపిస్తారన్నారు. దేశ చరిత్రలోనే మొదటిసారిగా ఒక ప్రతిపక్షపార్టీ అయిన కాంగ్రెస్ పార్టీ ఖాతాలో ఉన్న డబ్బులను ఫ్రీజ్ చేయించడం దారుణమన్నారు.

పీస్ కమిటీలలో మహిళలు, యువకుల పాత్ర పెరగాలి

గోల్కొండ: పీస్ అండ్ మైత్రి కమిటీలలో యువకులు, మహిళలు క్రియాశీలకంగా పని చేయాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శనివారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ఈసారి పీస్ కమిటీలలో తాను ఆశించినట్లుగా యువకుల సంఖ్య పెరిగిందన్నారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు, పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు ఆబీద్, షానవాజ్‌ఖాన్, ఇలియాస్ అలీ, ఇమ్రాన్ అలీఖాన్, పూస వేణుగోపాల్, సదానందం ఉన్నారు.

జీహెచ్‌ఎంసీ స్వచ్ఛ ఆటోల బ్యాటరీల చోరీ

జియాగూడ: జీహెచ్‌ఎంసీ స్వచ్ఛ ఆటోల బ్యాటరీలను దొంగిలించిన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం వెలుగు చూసింది. ఎస్ఐ.నర్సింగ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం .. జియాగూడ కేశవస్వామినగర్‌కు చెందిన ఎన్.మహేష్(28) బస్తీలలో స్వచ్ఛ ఆటో ద్వారా చెత్తను సేకరించి డంప్ యార్డుకు తరలిస్తుంటాడు. శుక్రవారం సేకరించిన చెత్తను డంప్‌యార్డుకు తరలించి తిరిగి స్వచ్ఛ ఆటోను కేశవస్వామినగర్ గోశాల పక్కన మిగతా స్వచ్ఛ ఆటోల పక్కన నిలిపి ఉంచాడు. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు నిలిపి ఉంచిన మూడు స్వచ్ఛ ఆటోల నుంచి బ్యాటరీలను దొంగలించి పారిపోయాడు. ఈ మేరకు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మరో ఘటనలో కెమెరా లెన్స్‌లు..

జియాగూడ: ఓ ఫంక్షన్‌లో ఫొటో షూట్ చేసేందుకు వినియోగించే కెమెరా లెన్స్‌లను దొంగిలించిన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం వెలుగు చూసింది. ఎస్ఐ.నర్సింగ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం..పోలీస్‌స్టేషన్ పరిధిలోని సబ్జిమండి గంగపుత్ర సంఘంలో ఈ నెల 20న నిశ్చితార్థం ఫంక్షన్ ఉండగా అత్తాపూర్ సాయినగర్‌కు చెందిన రాజు కనిగిరి వృత్తిరీత్యా ఫొటో షూటర్. ఇతని కెమెరాకు సంబంధించిన 105 ఎం.ఎం, 50 ఎం.ఎం, 85 ఎం.ఎం. కెమెరా లెన్సులు రాత్రి 10.30 గంటల సమయంలో బ్యాగ్‌లో పెట్టి స్టేజ్ ఎదురుగా ఉంచాడు. అవసరం నిమిత్తం బ్యాగులో ఉన్న సుమారు రూ.40 వేల విలువ చేసే లెన్సులు లేవని గుర్తించాడు. వెతికినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హోలీ వేడుకలకు సర్వం సిద్ధం

కామదహనానికి ఏర్పాట్లు ముమ్మరం ● హోలీలో మార్వాడీల ప్రత్యేకత


లాల్‌దర్వాజ మోడ్ వద్ద రంగుల విక్రయాలు


గౌలిపురా మార్కెట్‌లో..

చార్మినార్: హోలీ పండుగను ఈసారి ఘనంగా జరుపుకోవడానికి పాతబస్తీ ప్రజలు సిద్ధమయ్యారు. పాతబస్తీ ప్రజలు హోలీ వేడుకలను ప్రత్యేకంగా జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో నిర్వహించే కామదహనం, హోలీ రంగుల పండుగ (దులండి)ల కోసం ఇప్పటికే ఏర్పాట్లు జరుగుతున్నాయి. హోలీ వేడుకల్లో సింథటిక్ కలర్స్ కాకుండా ఆర్గానిక్ రంగులను వినియోగించి..చర్మాన్ని, కళ్లను కాపాడుకోవాలంటున్నారు వైద్య నిపుణులు. కాముదహనం, హోలీ పండుగ సందర్భంగా దక్షిణ మండలం పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

ఇతర రాష్ట్రాల వారు..

పాతబస్తీ గుల్జార్‌హౌజ్, పత్తర్‌గట్టి, మామా జుమ్లా పాటక్, కోకర్‌వాడి, శక్కర్‌కోట, బండికా అడ్డా, పేట్లబురుజు, మూసాబౌలి, హైకోర్టు రోడ్డు తదితర ప్రాంతాల్లో మార్వాడీలు, బెంగాలీలు, కన్నడీగులు, జైన్‌లు, మరాఠీలు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరి లైఫ్ స్టైల్‌తో పాటు ఉత్సవాల్లో కూడా వీరి ప్రత్యేకత కనిపిస్తుంది. వీరంతా తమ తమ సంప్రదాయం ప్రకారం హోలీ వేడుకలలో పాల్గొంటారు.

కామదహనం కోసం ఏర్పాట్లు..

పాతబస్తీలో నిర్వహించే కామదహనం కోసం ఇప్పటి నుంచే ప్రధాన కూడళ్లు, బస్తీలలో పెద్ద ఎత్తున కట్టెలను, పిడికెలను పోగు చేస్తున్నారు. ఒకరిపైఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకుంటూ కామదహనంలో పాల్గొంటారు. కామదహనం సందర్భంగా పాతబస్తీలోని వివిధ కులాలకు చెందిన మహిళలు వారి వారి సంప్రదాయాలకనుగుణంగా కామదహనం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పూజలు చేస్తారు.

> **సందడిగా మార్కెట్లు..**
> హోలీ సందర్భంగా పాతబస్తీలోని చార్మినార్, గుల్జార్‌హౌజ్, గౌలిపురా, ఉప్పుగూడ, ఛత్రినాక, లాల్‌దర్వాజా, అలియాబాద్, బ్రహ్మణవాడి, చాంద్రాయణగుట్ట, పురానాపూల్, దూద్‌బౌలీ తదితర ప్రధాన మార్కెట్లు వివిధ రంగుల దుకాణాలతో సందడిగా మారాయి.

మూడు రోజుల ముందుగానే..

గుజరాత్, హరియాణా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన అగర్వాల్ కుటుంబీకులు తమ బంధు మిత్రులతో కలిసి ఆనందోత్సాహాల నడుమ హోలీ వేడుకల్లో పాల్గొంటారు. కామదహనం రోజు అగర్వాల్ కుటుంబీకులు రెండు మూడు రోజుల ముందుగానే కామదహనం కోసం తమ ఇళ్లలో పిడకలతో చందమామ, నక్షత్రాలు, టెంకాయల ఆకారాలను తయారు చేసి ఎండ బెడతారు. వీటిని కామదహనం రోజు వీధులలో ఏర్పాటు చేసిన కట్టెలలో వేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పూజల అనంతరం మధ్యాహ్నం భోజనం చేసి మరుసటి రోజు (హోలీ పండుగ రోజు)వరకు ఉపవాసం ఉంటారు.

> **సింథటిక్ కలర్స్ వాడొద్దు..**
> సిథటిక్ కలర్స్ హాని కల్గిస్తాయి. చర్మంతో పాటు కళ్లు కూడా పాడవుతాయి. ఆర్గానిక్ రంగులే మేలు. ముఖ్యంగా మొదుగు చెట్టు నుంచి లభించే మోదుగు పూలను వినియోగించాలి. మొదుగు పూలను నీళ్లలో వేడి చేసి.. వడపోయగా వచ్చే ఆరెంజ్ రంగు నీళ్లతో హోలీ ఆడాలి. చలికాలం నుంచి ఎండా కాలంలోకి అడుగుపెడుతున్న తరుణంలో హోలీ వేడుకలొస్తాయి. అంటే ఎండల నుంచి తమను తాము రక్షించు కోవడానికి మోదుగు పూలతో హోలీ వేడుకలను నిర్వహిస్తే చర్మంపై ఒక పలుచని పొర ఏర్పడి ఎండ వేడిమిని తట్టుకునేటట్లు చేస్తుంది.
> – డాక్టర్ సురేందర్ శర్మ, ఆయుర్వేద వైద్యులు

కాటి కాపరుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

గోల్కొండ: హిందూ శ్మశాన వాటికల్లో వసతులు కల్పించడంతో పాటు కాటి కాపరులకు ప్రభుత్వం హెల్త్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ మాల బ్యాగరీ కాటి కాపరుల సంఘం జాతీయ అధ్యక్షుడు ఏ.కేశవులు కోరారు. సంఘం సమావేశంలో మెహిదీపట్నంలోని దేవుడికుంట శ్మశాన వాటికలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కాటి కాపరులు శవాల దహనం సమయంలో దహన ప్రక్రియలో అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశాన వాటికల్లో స్నానపు గదులు, లైట్లు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. వాష్‌రూమ్‌లు లేక శ్మశాన వాటికకు వచ్చే వారు నానా అవస్థలు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా తమ సంఘం తరఫున పర్యటనలు చేస్తూ శ్మశాన వాటికల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బ్యాగరి శ్రీను, బ్యాగరి సురేంద్ర, బ్యాగరి వెంకట స్వామి తదితరులున్నారు.

ఇఫ్తార్ విందు



డబీర్‌పురా: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని డబీర్‌పురా ఫర్హత్‌నగర్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన దావత్–ఇ–ఇఫ్తార్ కార్యక్రమంలో మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల పాల్గొని ఉపవాస దీక్షను విరమించారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట్ నియోజకవర్గంలోని ఎంఐఎం కార్పొరేటర్లు, మజ్లిస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు భాషా చైతన్య సమితి, గోల్కొండ సాహితీ కళా సమితిల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని రచయిత డాక్టర్ హారతి ద్వారకనాథ్ రచించిన పుస్తకావిష్కరణ సభ శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీ వేత్త ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ..హైదరాబాద్ సంస్థానం విమోచనానికి, తెలంగాణ దార్శనికుల పేరిట రచయిత చేసిన ప్రయత్నం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ కె.ప్రభాకర్‌రెడ్డి, ప్రముఖ గంట మనోహర్‌రెడ్డి, గోల్కొండ సాహితీ కళాసమితి అధ్యక్షులు అర్ధచంద్ర ప్రకాష్‌రెడ్డి, అనంత రామకృష్ణ శర్మ, డాక్టర్ రాధాకుసుమ, పి.బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ.. ముగ్గురికి గాయాలు

జియాగూడ: పురానాపూల్ 100 ఫీట్ల జాతీయ రహదారిలో వెళ్తున్న కారును మరోకారు రాంగ్‌రూట్‌లో వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో ముగ్గురికి గాయాలైన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం వెలుగు చూసింది. ఎస్ఐ భావన తెలిపిన వివరాల ప్రకారం..లంగర్‌హౌస్‌కు చెందిన శ్రీకాంత్ థివారి(47) వృత్తిరీత్యా స్వయం ఉపాధి. శుక్రవారం ఉదయం పురానాపూల్ నుంచి లంగర్‌హౌస్‌కు భార్య రూపా థివారి, వదిన దీపా దూబర్‌లతో కలిసి కారులో లంగర్‌హౌస్‌కు వెళ్తున్నాడు. కాశిబుగ్గ ఆలయ ప్రాంతంలో ఓ వ్యక్తి కారును రాంగ్‌రూట్‌లో వేగంగా నడుపుకుంటూ వచ్చి ఎదురుగా వస్తున్న థివారి కారును ఢీ కొట్టాడు. దీంతో కారు డ్యామేజీ కాగా అందులో ముగ్గురికి కూడా గాయాలయ్యాయి. దీంతో వారిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి


సదస్సులో పాల్గొన్న వక్తలు

సుల్తాన్‌బజార్: భౌతిక శాస్త్ర సిద్ధాంతాల ఆధారంగా రూపొందించిన వివిధ టెక్నాలజీని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌ఎల్‌ఏ మాజీ డైరెక్టర్ జి.మధుసుదన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ చాప్టర్, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్రం విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం పీజీ ఆడిటోరియంలో నాన్ రెస్పెక్టివ్ ఎడ్యుకేషన్ అండ్ టెక్నిక్స్ అనే అంశంపై ఒకరోజు సదస్సు జరిగింది. ఈ సదస్సులో మధుసూదన్‌రెడ్డి పాల్గొని భౌతిక శాస్త్రం విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై పలు సూచనలు సలహాలు అందజేశారు. భౌతిక శాస్త్రం ఏ విధంగా విద్యార్థులకు అనుగుణంగా ఉంటుందో వక్తలు సవివరంగా ప్రయోగాత్మకంగా ప్రదర్శించి అవగాహన కల్పించేందుకు ఇలాంటి సదస్సులు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఎల్ మాజీ డైరెక్టర్ ఎం.రామ మనోహర్‌బాబు ఎం.ఎస్‌వి. విశ్వనాథం. కె.శ్రీనివాస్, భౌతికశాస్త్రం టెక్నాలజీ హెచ్‌ఓడీ నరేంద్రబాబు, అధ్యాపకులు డాక్టర్ రజిని మాలతితో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సెయింట్ ఆన్స్ కళాశాల అలూమ్నీ మీట్


అలూమ్నీ మీట్‌లో నటుడు అమర్‌దీప్ చౌదరి తదితరులు

గోల్కొండ: కళాశాల పూర్వ విద్యార్థులు తమ ప్రతిభతో తాము చదివిన కళాశాలకు గర్వంగా మారుతారని మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ విజయరాణి అన్నారు. శనివారం కళాశాలలో ఎన్యువల్ అలూమ్నీ అనోరీ–2024 వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఈ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు దూరప్రాంతాల నుంచి సైతం తరలివచ్చారు. కళాశాల అలూమ్నీ ప్రొఫెసర్ డాక్టర్ సుధ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తమ కళాశాల పూర్వ విద్యార్థినులు ఉస్మానియా యూనివర్సిటీలో పాటు ఇతర ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లో కీలక పదవుల్లో ఉన్నారన్నారు. వారంతా అలూమ్నీ వేడుకల్లో పాల్గొడానికి ఎంతో ఉత్సాహంతో రావడం ప్రస్తుత విద్యార్థినులకు ప్రేరణగా నిలుస్తున్నారని ఆమె అన్నారు. వర్ధమాన నటుడు అమర్‌దీప్‌చౌదరి, కరస్పాండెంట్ దయాకుమారి, సెక్రటరీ ఆఫ్ అలూమ్నీ అసోసియేషన్ డాక్టర్ టి.అనురాధా, కన్వీనర్ ఇందిరా ప్రియదర్శిని, అలుమ్నీ ప్రతినిధులు డాక్టర్ స్వాతిరెడ్డి పాల్గొన్నారు.

సోదరితో సన్నిహితంగా ఉండడాన్ని తట్టుకోలేకే..

యువకుడి హత్య కేసులో నలుగురి అరెస్ట్


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సాయి చైతన్య

చాంద్రాయణగుట్ట: యువకుడి హత్య కేసులో నలుగురు నిందితులను బహదూర్‌పురా పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. పురానీహవేలీలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, అదనపు డీసీపీ షేక్ జహంగీర్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. కిషన్‌బాగ్‌కు చెందిన సయ్యద్ ఇమ్రాన్(30), సయ్యద్ సయీద్(35), సయ్యద్ సమీర్(23)లు అన్నదమ్ములు. వీరి సోదరి ఫర్హానా బేగం(17)తో ఇదే ప్రాంతానికి చెందిన వివాహితుడైన మహ్మద్ షర్ఫ్(27) సన్నిహితంగా ఉండడాన్ని గమనించిన అన్నదమ్ములు గతంలోనే మందలించారు. అయినప్పటికీ తీరు మార్చుకోకపోవడంతో షర్ఫ్‌ను మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం తమ బావమరిది మహ్మద్ అజీం(28)ను కూడా కలుపుకున్నారు. ఈనెల 20న జాకీర్ కిరాణాస్టోర్ వద్ద ఉన్న షర్ఫ్‌ను ఇమ్రాన్ ఆటోలో ఎక్కించుకొని తమ తల్లి ఇంటికి తీసుకెళ్లి తీవ్రంగా కొట్టారు. ఫిట్స్ వచ్చి అపస్మారక స్థితికి చేరుకున్న షర్ఫ్‌ను ఆటోలో తీసుకొని కిషన్‌బాగ్ పార్కు వద్ద వాహనాల మధ్యలో ఆటోను పార్కు చేసి ఎవరికి కనిపించకుండా కింద పడేసి పరారయ్యారు. అనంతరం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి అతన్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నలుగురి నిందితులను శనివారం అరెస్ట్ చేశారు. ఈ సమావేశంలో బహదూర్‌పురా ఇన్‌స్పెక్టర్ ఆర్.రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న క్రాంతి కుమార్


ఏబీవీపీ కోఠి జిల్లా ఆధ్వర్యంలో..


నివాళులర్పిస్తున్న ఎన్ఆర్.లక్ష్మణ్‌రావు

గౌలిపురా: పరాయి పాలన నుంచి దేశ విముక్తి కోసం ప్రాణాలను తృణపాయంగా విడిచిన మహనీయులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లనీ మిత్ర యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.పి.క్రాంతి కుమార్ అన్నారు. శనివారం ఛత్రినాకలో యువజన సంఘం ఆధ్వర్యంలో 93వ వర్ధంతి కార్యక్రమంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు పూలమాలవ వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. నేటి యువతకు భగత్ సింగ్ స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సంయుక్త కార్యదర్శి బి.కోటేష్, సభ్యులు బి.వెంకటేష్ చారి, మోక్షిత్, సుశాంత్, రిషి, కౌశిక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సిటీ కళాశాలలో..

చార్మినార్: ఏబీవీపీ కోఠి జిల్లా ఆధ్వర్యంలో ప్రభుత్వ సిటీ కళాశాలలో శనివారం షాహిద్ దివస్ కార్యక్రమం జరిగింది. కోఠి జిల్లా కన్వీనర్ సభావట్ కల్యాణ్ మాట్లాడుతూ.. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల గొప్పతనాన్ని వారు దేశం కోసం చేసిన ప్రాణత్యాగలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు సజన్, నగర కార్యదర్శి రాహుల్, సాశిక్, కళాశాల కార్యదర్శి జితేందర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ శ్రీకాంత్, విద్యార్థి నాయకులు రాహుల్, రుసేంద్ర శ్రీను, దుర్గ ప్రసాద్, శివ శంకర్, మధు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న బీజేవైఎం కన్వీనర్ సోమ్రాజ్ సింగ్ తదితరులు

బీజేపీ ఆధ్వర్యంలో..

గోల్కొండ: బీజేపీ ఆధ్వర్యంలో శనివారం షహీద్ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. కార్వాన్ బంజావాడీలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు, ఆపార్టీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవిలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిజ్వర్‌సింగ్, గోవర్ధన్, భిక్షపతి, యమన్‌సింగ్, రాధాకిషన్ యాదవ్, శ్రీకాంత్‌సాగర్, రక్షిత్‌సాగర్ తదితరులున్నారు.

బేగంబజార్‌లో..

అబిడ్స్: భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బేగంబజార్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోషామహల్ నియోజకవర్గం బీజేవైఎం కన్వీనర్ సోమ్రాజ్‌సింగ్, సిద్ధుసింగ్, చరణ్‌యాదవ్, సోమేష్ యాదవ్ తదితరులు పూలమాలలు వేసి ఆయన దేశానికి చేసిన సేవలు కొనియాడారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మహోన్నత నేత అని ఆయన అన్నారు.

సుల్తాన్‌బజార్లో..

సుల్తాన్‌బజార్: దేశ స్వాతంత్రం కోసం సింగ్ సుఖ్‌దేవ్ రాజ్‌గురు లాంటి స్వాతంత్ర సమర యోధుల త్యాగాలను స్మరించుకోవాలని బజరంగ్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు అన్నారు. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్ రాజ్‌గురుల వర్ధంతిలను పురస్కరించుకొని శనివారం భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేటి యువత భగత్‌సింగ్ అడుగుజాడల్లో నడచి దేశం కోసం పోరాడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్యశుక్లా, విజయ్ తివారి, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, రాజేందర్ సింగ్, రాజశేఖర్, మోనా సింగ్, ఆశీష్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

చార్మినార్: అత్యున్నత స్థానాల్లో మహిళలు నాయకులుగా రాణించాలని తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎం. విజ్జుల్లత అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సౌజన్యంతో ‘సామాజిక సమ్మిళిత అభివృద్ధిలో మహిళల పాత్ర’అనే అంశంపై జరుగుతున్న మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన విజ్జులత మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరిగినపుడు మాత్రమే సామాజిక ప్రగతి వేగవంతమవుతుందన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన అనురాగ్ విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య సమీన ఫాతిమా మాట్లాడుతూ..మహిళలను అణచి వేసినంత కాలం సమాజం ముందుకు పోదని అన్నారు. పర్యావరణ వేత్త ఆచార్య పురుషోత్తమరెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలో జరిగిన పర్యావరణ ఉద్యామాలన్నిటికీ మహిళలే మార్గ దర్శకులుగా నిలిచారని చెప్పారు. సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి బాల భాస్కర్, డా రుక్మిణి, డా.రవి బాబు, డా.వి. శ్రీదేవి, అవధానం సుజాత, డా.నర్మద, శ్రీమతి వేదవతి, డా.సుదక్షిణ, డా.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

‘నిస్వార్థ ప్రజా నాయకుడు దేవర కరుణాకర్’


దేవర కరుణాకర్ కుటుంబసభ్యులతో మాధవీలత

గోల్కొండ: గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ నిస్వార్థ ప్రజా సేవకుడని బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి కె.మాధవీలత అన్నారు. శనివారం ఆమె గుడిమల్కాపూర్‌లోని దేవర కరుణాకర్ కుటుంబ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా ఆమె కరుణాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మూడు దశాబ్దాలకు పైగా రాజకీయ జీవితంలో శత్రువులు లేకుండా ముందుకు సాగిన ఏకైక నాయకుడు దేవర కరుణాకర్ అని ఆమె అభివర్ణించారు. కార్పొరేటర్‌గా వివిధ డివిజన్‌ల నుంచి ఎన్నికవుతూ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసిన ధీశాలి అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో దేవర వంశీ, రాధాకిషన్‌యాదవ్, ప్రభుపూజారి, నామా యాదగిరి తదితరులున్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

గౌలిపురా: గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా గంజాయి విక్రస్తున్న ఓ వ్యక్తిని భవానీనగర్ పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండ్ తరలించారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్ ప్రాంతానికి చెందిన రైల్వే స్టేషన్ సమద్ హోటల్ ప్రాంతంలో మీర్ రియాజ్ అలీ (27) పాత నేరస్థుడు. రియాజ్ అలీపై భవనీనగర్ పీఎస్ పరిధిలో నాలుగు, మీర్ చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదై ఉన్నాయి. రియజ్ గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు భవానీనగర్ పోలీసులు దాడులు చేసి అతని వద్ద నుంచి 1.80 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు.